www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 23 డిసెంబర్ 2022





గ్రామాన్ని సందర్శించిన ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కొండయ్య

ఐక్య పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

- సిఐటియు జిల్లా మొదటి మహాసభల్లో రాష్ట్ర నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ఐక్య పోరాటాల ద్వారానే రాష్ట్ర, దేశవ్యాప్తంగా ఉన్న అసంఘటిత కార్మికుల సమస్యలకు పరిష్కార మార్గం ఏర్పడుతుందని సిఐటియు రాష్ట్ర నాయకులు అన్నారు. గురువారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో సిఐటియు జిల్లా మొదటి మహాసభలు నిర్వహించారు. మహాసభలకు రైల్వేకోడూరు, రాజంపేట, మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లె నుంచి పెద్ద ఎత్తున కార్మికులు హాజరయ్యారు. ముందుగా మాసాపేట మీదుగా మదనపల్లె రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వరకు కార్మికులు సిఐటియు జెండాలు పట్టుకొని భారీ ర్యాలీగా బంగ్లా సర్కిల్‌లోని మైదానంలో ఏర్పాటు చేసిన మహాసభ ప్రాంగణానికి చేరుకున్నారు. సభా ప్రాంగణమంతా కార్మికులు, కార్మిక సంఘాల నేతలతో నిండిపోయింది. అనంతరం సిఐటియు జిల్లా కార్యదర్శి రామాంజులు అధ్యక్షతన చేపట్టిన సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శులు సుబ్బరావమ్మ, బాలకాశి కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని విమర్శించారు. ఎన్నో ఏళ్లుగా అసంఘటిత కార్మికులైన మున్సిపల్, ఆశా, అంగన్వాడీ, విద్యుత్, హమాలీలు, విఆర్‌ఎలు, భవన నిర్మాణ కార్మికులు ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతో మంది కార్మికులు వారి సమస్యలు పరిష్కారం కాక పలు రకాల ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి కనీస వేతనంగా రూ.26 వేలు జీతం ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా కార్మికులు పోరాటాలు చేస్తున్న ఈ ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో మనమంతా ఉన్నామని, ఆయన మాత్రం రాష్ట్రంలోని 56 శాతం మంది అత్యంత సంతోషంగా జీవిస్తున్నారని



సభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

చెబుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కనీసం ఉద్యోగులకు నెల నెలా జీతాలు సక్రమంగా ఇవ్వలేని పరిస్థితి నేడు రాష్ట్రంలో నెలకొని ఉందన్నారు.వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో సమస్యలు పెరిగాయి కానీ, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం ఆయన దాఖలాలు ఎక్కడ కనిపించడం లేదన్నారు. జీతాలు పెరిగితే కుటుంబాలను పోషించుకోవచ్చునన్న కార్మికుల బాధలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సారి 175 సీట్లకు 175 రావాలని జగన్మోహన్‌రెడ్డి చెప్పడం విచిత్రంగా ఉందన్నారు. కార్మికుల కడుపు కొడుతూ వారిని పట్టించుకోకుండా ఉన్నవారికి దోచిపెడుతున్న వెసిపి ప్రభుత్వానికి 175 సీట్లు ఎలా వస్తాయో మేము చూస్తామన్నారు. అన్ని రకాల కార్మికులకు మోసం చేసిన జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు కార్మికులంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. నిర్బంధాల ద్వారా ఉద్యమాలను ఆపాలని చూస్తే ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని ప్రభుత్వాన్ని హెచ్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్వాడీ, ఆశా వర్కర్ల సమస్యలను ఈ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పక్క రాష్ట్రాల్లో 20 వేలకుపైగా అంగన్వాడీలకు జీతాలు ఇస్తుంటే ఈ రాష్ట్రంలో కనీసం రూ.వెయ్యి కూడా జీతం పెంచిన దాఖలాలు లేకపోవడం కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కరోనా సమయంలో అంగన్వాడీ, ఆశా, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తే కనీసం కార్మికుల సమస్యలను పరిష్కరించిన పాపాన పోలేదన్నారు. నిబంధనల ద్వారా కార్మికుల ఉద్యమాలను ఆపాలని చూస్తే గత ప్రభుత్వాలకు పట్టిన గతే ఈ వైసిపి ప్రభుత్వాన్ని కూడా పడుతుందనే విషయాన్ని ముఖ్యమంత్రి తెలుసుకొని నడుచుకుంటే బాగుంటుందని హెచ్చరించారు. అంగన్వాడీ, ఆశ వర్కర్లకు ప్రతినెలా ఒకటో తేదీ కల్లా జీతాలు ఇవ్వడమే కాకుండా పెండింగ్‌లో ఉన్న టిఎ, డిఎలు, ఇంటి అద్దెలు, కూరగాయల బిల్లులు సక్రమంగా చెల్లించి కార్మికుల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో అంగన్వాడీ వర్కర్లతో పాటు ఆశ వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, విద్యుత్ కార్మికులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు ఎన్నో రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. ప్రధానంగా భవన నిర్మాణ కార్మికులకు పనులు దొరక ఎంతోమంది కుటుంబాలు పోషించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలంటే ఉద్యమాల ద్వారానే అవి సాధ్యమని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు రవికుమార్, చంద్రశేఖర్, రాజేశ్వరి, శంకరమ్మ, కరిష్మా, మధువాణి, శ్రీహరి, సుబ్రహ్మణ్యం రాజు, రమణ, నాగేశ్వర గౌడ్, భాగ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, ఖాజాబీ, బంగారుపాప, ప్రజానాట్య మండలి కళాకారులు వెంకట చలపతి, అంజనప్ప, సరస్వతి మల్లి, శ్రీరాములు, అరుణమ్మ భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుండి అసంఘటత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



బహిరంగ సభకు హాజరైన మహిళా కార్మికులు



పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న కార్మికులు, నాయకులు



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న రాష్ట్ర, జిల్లా నాయకులు

వరద గ్రామాలను వణికిస్తున్న విషజ్వరాలు

వైద్య శిబిరాలు నిర్వహించిన ఆర్‌డిఒ, డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గత ఏడాది జవాద్ తుపాను కారణంగా అన్నమయ్య డ్యామ్ తెగిపోవడం వలన సంభవించిన వరద విపత్తులో ప్రాణాలతోపాటు సర్వం కోల్పోయిన వరద ప్రభావిత ప్రాంతమైన ఎగువ మందపల్లెలో ప్రజలను విష జ్వరాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఆ గ్రామంలో అడపాల సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బమ్మ అనే ఇద్దరు ఇప్పటికే మృతి చెందగా మరో ఆరుగురు రక్తకణాలు తగ్గిపోవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామంలో మరికొంత మంది విషజ్వరాల బారిన పడి ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాజంపేట ఆర్‌డిఒ కోదండరామిరెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్యతో కలిసి ఎగువ మందపల్లిలో పర్యటించి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రక్తం నమూనాలను సేకరించి పరీక్షించారు. పది మందికి జ్వరాలు ఉన్నట్లు తేలిందని నిర్ధారించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బమ్మలు కిడ్నీ, మధుమేహ సమస్యలతో మృతి చెందినట్లు తెలిపారు. గ్రామంలో ఆరుగురు రక్తకణాలు తగ్గడంతో తిరుపతిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. గ్రామంలో అనారోగ్య సమస్యలు తగ్గే వరకు ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా గ్రామస్తులకు వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బాల మునిస్వామి, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ శేఖర్, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



వాల్మీకిపురం : విద్యార్థికి ట్యాబ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పేద విద్యార్థులకూ అధునాతన విద్య :'చింతల'

ప్రజాశక్తి-వాల్మీకిపురం

కార్పొరేట్, ప్రైవేటు విద్యాభోదనకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అధునాతనమైన విద్య అందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న 183 మంది విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ట్యాబ్‌లను ఉచితంగా అందజేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అనేక పథకాలను అందిస్తూ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాధులు వేస్తున్నారన్నారు. నాడు నేడు పనుల ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చేస్తున్నారని, విద్యార్థులకు అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, గోరుముద్ద వంటి పథకాల ద్వారా పేద విద్యార్థుల విద్యకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నారన్నారు. ట్యాబ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన సిబిఎస్ఇకి అవసరమైన కంటెంట్ కూడా ఉంటుందన్నారు. ఇంటర్నెట్‌తో సంబంధం లేకుండా కంటెంట్ చదువుకునే వెసులుబాటు ఈ ట్యాబ్‌లలో అందుబాటులో ఉంటుందన్నారు. ప్రైవేటుగా ఈ తరహా విద్యాబోధనకు వేల రూపాయల ఖర్చు అవుతుందని, కానీ ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ షబ్బీర్ అహ్మద్, హెచ్‌ఎం శ్రీదేవి, ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం అమరనాథరెడ్డి, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, ఆనంద, రాయుడు, ఉపాధ్యాయులు నాగరాజ, రసూల్ బావాజి, బాలాజి, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాపురం : ఎపి మోడల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మాజీ ఎంఎల్‌ఎ గడికోట మోహన్‌రెడ్డి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 450మంది ఉన్నారని అన్నారు. వారిలో 15 మందికి మాత్రమే పంపిణీ చేశామని, మిగిలిన వారికి రెండు రోజుల్లో అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అమ్మఒడి, విద్యా దీవెన, గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకం మరి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని అన్నారు. అనంతరం ప్రిన్సిపల్ శ్యామలదేవి, ఎంఇఒ రామకృష్ణుడు, కొండవాండ్లపల్లె ప్రధానోపాధ్యాయులు షామీర్‌బాష, ఉపాధ్యాయులు మాజీ ఎంఎల్‌ఎను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మండల కన్వీనర్ గడికోట జనార్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాధరెడ్డి, జడ్‌పిటిసి మానస వెంకటరమణ, వైసిపి రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రెటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి సర్పంచులు నాగభూషణ్ రెడ్డి, రామాంజులు, వైస్ ఎంపిపి రవిశంకర్‌రెడ్డి, మాజీ ఎంపిటిసి ఎంపీటీసీ హరినాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, స్కూల్‌కమిటీ చైర్మన్ ధర్మారెడ్డి. ఉపాధ్యాయులు శంకర్ రెడ్డి రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి-రామాపురం

విజ్ఞాన కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించవచ్చని కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ బి.శిల్పకళ, డాక్టర్ కె.సాయి మహేశ్వరి అన్నారు. మండలంలోని బండపల్లి గ్రామపరిధిలో సుబ్బరాయుడు అనే రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కషాయాల తయారీ, పురుగులను తెగుళ్ల నియంత్రణ గురించి వివరించారు. లింగాకర్ష బుట్టలు, జిగురు పల్లాలు, డెల్టా ఎరలు రామాపురం పరిధిలోని పలు రైతులకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఇచ్చామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం అనుకరించడానికి రైతులు ఉత్సాహం చూపాలని తెలిపారు. దీర్ఘకాలిక దిగుబడితో లాభాలు పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో కె.వి.కె శాస్త్రవేత్తలు, మండల ప్రకృతి యాంకర్ వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన : టిడిపి

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. గురువారం ఇదేం కర్మ కార్యక్రమం 27వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని సర్వనాశనం చేయడం కోసమే జగన్మోహన్‌రెడ్డి వైసిపిని పెట్టారన్నారు. రాష్ట్రంలో ఇసుక ధరలు భారీగా పెంచి భవన కార్మికుల కడుపు కొట్టారన్నారు. అక్రమంగా ఇసుక తరలించుకుని రూ.కోట్లు వైసిపి నాయకులు ఖజానా నింపుకుంటున్నారని తెలిపారు. ఒకపక్క ఉద్యోగ ఉపాధి లేకుండా నిరుద్యోగ యువతకు మోసం చేస్తున్నారున్నారు. రాష్ట్రానికి అభివృద్ధి నడక నేర్పించింది చంద్రబాబు నాయుడన్నారు. వచ్చే ఎన్నికలలో చంద్రబాబు పట్టం కట్టడం ఖాయమని పేర్కొన్నారు. పేద ప్రజల రక్తాన్ని పీల్చుకొని వైసిపి నాయకులు తింటున్నారన్నారు. ప్రతి ఒక్కరి నోటి నుండి వినిపిస్తున్న మాట ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఓటు వేసి ఖర్మ అనుభవిస్తున్నామని చెబుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు నైఫ్ ఐటిడిపి రాజంపేట పార్లమెంటరీ కార్యనిర్వాహక కార్యదర్శి అత్తార్, జావేద్, రాజంపేట పార్లమెంటరీ బిసి కార్యదర్శి రామచంద్ర, నియోజకవర్గ తెలుగు యువత నాయకులు మొహమ్మద్, అర్షద్, ఇర్షద్ పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణలో అధికారుల విఫలం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు పదో తరగతి పరీక్షల పేరుతో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, విద్యాశాఖాధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆర్‌యస్‌యు జిల్లా అధ్యక్షుడు జై సింహారెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లాలో ఉన్న ప్రయివేట్ పాఠశాలల్లో పదవ తరగతి పరీక్ష ఫీజు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రూ. 125 ఉండగా జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో రూ.1200 నుంచి రూ. 1500 వరకు వసూలు చేస్తున్నారని విమర్శించారు. స్థానికంగా ఉన్న విద్యాశాఖ అధికారి అన్నీ తెలిసినా తమకు ఏ సంబంధం లేదనే విధంగా వ్యవహరించడం బాధాకరమని వాపోయారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు జోక్యం పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు.లేనిపక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యు జిల్లా కార్యదర్శి విష్ణు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

రాయచోటి : ఎస్‌సి వర్గీకరణకు ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్‌పి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎంఎస్‌పి జాతీయ నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో మహాదీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగలకు ఇచ్చిన హామీని ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగం ప్రసాదించిన 15 శాతం రిజర్వేషన్లు ఒక వర్గం వారే దోచుకుంటున్న దరిమిలా 28 ఏళ్లుగా వర్గీకరణ కొరకు పోరాటాలు చేస్తూనే ఉన్నామని తెలిపారు. ఎస్సీలలోని మాదిగ మాదిగ ఉప కులాలు విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ, సంక్షేమ రంగాలలో వెనుకబాటును గుర్తించి బిజెపి వెంటనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు తిరుపాల్, నారాయణ, సుబ్బయ్య, బద్రి, ఈశ్వరయ్య, రామానుజులు, శివయ్య, శంకర, శ్రీను, సాయి, బాలాజీ, సురేష్ బాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీస్తు విలువలను ముందుకు తీసుకెళ్లాలి

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

క్రీస్తు విలువలను ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్ గిరీష పిఎస్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'క్రిస్మస్ హై–టీ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, తదితరులు హాజరై క్యాండిల్ లైట్ వెలిగించి, క్రిస్మస్ కేక్ ను కట్ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గిరీష పిఎస్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పరంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రీస్తు ఐక్యతకి, అనురాగానికి, సామాజిక పరిపక్వతకి నిదర్శనమన్నారు. దయ, కరుణ, దాతృత్వం కలిగిన ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి దారి చూపుతాయన్నారు. క్రీస్తు మరణం తరువాత అందరికీ స్ఫూర్తి కలిగిస్తున్నారన్నారు. యేసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ రోజును ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా మాట్లాడుతూ చీకటిని పారద్రోలి వెలుగులు నింపడమే క్యాండిల్ లైట్ ఉద్దేశమన్నారు. ముందస్తుగా అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఆర్.వి కృష్ణ కిషోర్, క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులు, పాస్టర్‌లు, చర్చి పెద్దలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

- జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి



వీరబల్లి: రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ


ప్రజాశక్తి-వీరబల్లి

సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని పెద్దవీడు పంచాయతీ రెడ్డివారిపల్లి రైతులకు వేరుశనగ పంట పొలంలో పొలంబడి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. క్లస్టర్ లెవెల్ పొలంబడి కార్యక్రమంలో భాగంగా అగ్రికల్చర్ ఆఫీసర్ స్వాతి ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ హాజరై రైతుల పొలంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వేరుశనగ విత్తనం విత్తే ముందు నుంచి విత్తనం తయారయ్యే వరకు రైతు అవలంబించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి తక్కువ పెట్టుబడితో, ఎక్కువ దిగుబడులు సాధించేటట్లు అవగాహన కల్పించారు. ఇటువంటి పొలంబడి కార్యక్రమం ప్రతి గురువారం రైతు పొలంలో జరుగుతుందని తెలిపారు. బృందాలుగా ఏర్పడి వారు పంటను పరిశీలించి, నేల, మొక్క, ఆరోగ్య స్థితి కలుపు మొక్కలు పురుగు తెగుళ్ల వాతావరణం వాటిపై రైతులకు సూచనలు, సలహాలు ఇస్తారు. ఇచ్చిన సలహాలు సూచనలు అమలు చేస్తే రైతులకు దాని ప్రతిఫలం ఎలా ఉంటుందో రైతుల స్వయంగా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. పకృతి వ్యవసాయానికి, రసాయన వ్యవసాయానికి తేడా ఇంకా మెరుగైన పద్ధతులు పాటించడానికి సామూహికంగా రైతులు పకృతి వ్యవసాయం చేయడానికి సులభతరం అవుతుందన్నారు. ఈ మూడు సీజన్లకు సంబంధించి మేలైన యాజమాన్య పద్ధతుల పాటించి పంట సాగు చేసిన రైతులకు జిఎపి సర్టిఫికెట్ ఇస్తారని దీనివలన వారు పండించిన దిగుబడులకు అధిక గిట్టుబాటు ధరలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎఒఎలు శ్రీకాంత్, సావిత్రి, ఎఒలు రమేష్ రాజు, మల్లికా, వీరబల్లి వ్యవసాయ శాఖ అధికారి స్వాతి, ఎఇఒ షణ్ముగం, అన్ని గ్రామాల రైతులు, ఆర్‌బికె సిబ్బంది, పాల్గొన్నారు.

మైనార్టీలపై దాడులు శోచనీయం : 'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ఓట్లుతో గెలిచి వారిపైనే దాడులు చేస్తున్నారని టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినం వేడుకలు ఒకపక్క వైసీపీ నాయకులు సంబరాలు జరుపుకుంటూ ఉంటే, మరోపక్క వైసీపీ నాయకులు నరసరావుపేటలో ఇబ్రహీం అనే ముస్లిం మైనారిటీకి చెందిన వ్యక్తిని దారుణంగా హత్య చేయడం జగన్మోహన్ రెడ్డి జన్మదినం రోజు బహుమానంగా ఇచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ముస్లిం మైనారిటీలు, దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని వాపోయారు. పల్నాడు, నరసరావుపేటలో షేక్ ఇబ్రహీం అనే వ్యక్తి వక్ఫ్ బోర్డ్ ఆస్తి ఆక్రమణపై న్యాయపోరాటం చేస్తే కొంతమంది వైసిపి నాయకులు న్యాయ పోరాటం ఎదుర్కోలేక అతనిని దారుణంగా చంపడం అన్యాయమన్నారు. ముస్లిం మైనారిటీల కోసం 'నేను ఉన్నాను 'నేను వస్తున్నాను' నేను వింటున్నాను' అనే నినాదాలతో ముస్లిం మైనారిటీ ఓట్లతో అధికారంలోకి వచ్చి నేడు రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు ఎటువంటి రక్షణ లేక పోవడం, దీనిపై ముఖ్యమంత్రి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం హేయనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వానికి ముస్లిం మైనారిటీలపై ఎటువంటి చిత్తశుద్ధి ఉన్నా నరసరావుపేటలో జరిగిన సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి నేరస్తులను కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెసి, డిఆర్‌ఒ, అధికారులు

'చుక్కల భూముల నివేదిక పంపాలి'

ప్రజాశక్తి - రాయచోటి

జనవరి 15 నాటికి గ్రౌండ్ ట్రుతింగ్ పూర్తి చేయాలని సిసిఎల్‌ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుండి సంబంధిత శాఖల కార్యదర్శుతో కలసి వైఎస్‌ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం కార్యాచరణ అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్‌లు, జెసిలతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిసిఎల్‌ఎ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ గ్రౌండ్ ట్రుతింగ్ చేసే సమయంలో విఆర్‌ఒ తప్పనిసరిగా ఉండాలన్నారు. డ్రోన్ కంట్రోల్ పాయింట్స్ పై విఆర్‌ఎలకు ట్రైనింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. చుక్కల భూములకు సంబంధించి నివేదికలు పకడ్బందీగా పంపాలన్నారు. జిల్లా కేంద్రం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, డిఆర్‌ఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

బహుదా నదిపై వంతెన నిర్మించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో ప్రవహించే బాహుదా నదికి ఇరువైపులా వెలసిన ఆక్రమణలను తొలగించి వంతెన నిర్మాణం చేపట్టాలని మదనపల్లె టౌన్ అపెక్స్ వెల్ ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గొల్లపూడి తిరుపతిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో ప్రవహించే బాహుదా నది పూర్తిగా ఆక్రమణలకు గురికావడమేకాక నదిలో సరుగుడు చెట్లు ఇతర వృక్షాలతో నిండిపోయిందన్నారు. కొద్దిపాటి వర్షానికే సిటిఎం రోడ్డు ఆఫీసర్స్ క్లబ్ దగ్గర బాహుదానదిపై ఉన్న కాజ్‌వేపై నీరు ప్రవహించుట వలన తరచు రాకపోకలకు అంతరాయం కలుగుతున్నదన్నారు. పైకారణాల వలన వెంటనే బాహుదానదిని సర్వే చేయించి ఆక్రమణలు తొలగించి నదికి ఇరువైపులా రాతి కట్టడం వలన ఆక్రమణలు అరికట్టుటకు వీలుంటుందని తెలిపారు.



బొంగావారిపల్లెలో దారికి అడ్డుగా ఉన్న రాళ్లను తొలగిస్తున్న సిబ్బంది

దారి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ బొంగా వారిపల్లి లో ఏర్పడిన దారి సమస్యను సర్పంచు వరలక్ష్మి ఆదేశాల మేరకు సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైసిపి నాయకులు శశిధర్‌రెడ్డి, బ్యాంకు మనోహర క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొంగావారిపల్లె లోని గ్రామస్తులకు ఇదే గ్రామంలోని మరొక వ్యక్తితో స్థానికంగా సఖ్యత కుదరకపోవడంతో భాస్కర ఇంటి వద్ద దారికి అడ్డుగా రాళ్లను వేశారు. సమస్యను తెలుసుకున్న సర్పంచు స్థానిక నాయ కులను ఆదేశించగా వారు గ్రామ స్తులతో చర్చించి దారికి అడ్డుగా ఉన్న రాళ్లను తొలగించారు. దారిలో ఉన్న విద్యుత్తు స్తంభాన్ని మరొక చోటికి మార్చాలని గ్రామస్తులు కోరారు. స్థానిక పోలీసుల సమక్షంలో దారి సమస్యను పరిష్క రించారు. పంచాయితీ కార్యదర్శి గ్రామస్తులచేత సమస్య పరిష్కార అంగీకార పత్రాన్ని తీసుకున్నారు. కార్య క్రమంలో విద్యుత్‌శాఖ ఎఇ వసంతరెడ్డి, పంచా యతీకార్యదర్శి మంజునాథ్, వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ, పోలీసులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్లో ఆదర్శ విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి- కలకడ



నందకుమార్

హ్యాండ్‌బాల్ క్రీడల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థి ప్రతిభను ప్రదర్శిం చాడు. శ్రీకాళహస్తిలో జరిగిన హ్యాండ్‌బాల్ జిల్లాస్థాయి ఎంపికలో మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి నందకుమార్ అత్యంత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుండి కదిరిలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మలంగ్ షావలి మాట్లాడుతూ మారుమూల ప్రాంత మైన కోటగుడిబండ పంచాయతీ ఎల్లంగుడిబండకు చెందిన రైతు కుటుంబానికి చెందిన నర్సింహులు, దేవమ్మ రెండవ సంతానమైన నందకుమార్ తన ప్రతిభతో తల్లిదండ్రులకు, గ్రామానికి పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకు రావడం గర్వకా రణమన్నారు. నందకుమారును ప్రిన్సిపల్, ఫిజికల్ డైరెక్టర్ కరు ణాకర్, ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు అభినందించారు.

కూలీల సంఖ్య పెంచాలి : ఎపిఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచేందుకు మండలంలో టెక్నికల్ ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఎపిఒ మాధవి కోరారు. గురువారం ఉపాధిహామీ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీల వారిగా జరుగుతున్న పనులు, పాల్గొంటున్న కూలీలు, చెల్లించాల్సిన బిల్లులు తదితర అంశాలపై చర్చించారు. జరిగిన పనులకు సకాలంలో కొలతలు తీసి బిల్లులు పెట్టాలని సూచించారు. అప్పుడే వారిలో నమ్మకం కలిగి పనుల్లో పాల్గొంటారని అన్నారు. మండలంలో తంబళ్లపల్లె పంచాయతీలో 104 మంది కూలీలు పాల్గొంటున్నారని, మండలంలో 781 మంది కూలీల రోజు వారి పనుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా ఫీల్డ్‌అసిస్టెంట్లు కూలీలను చైతన్య పరచి పనుల్లో పాల్గొనే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఇలు శేఖరయ్య, నాగార్జున పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-పెద్దమండ్యం

ప్రభుత్వం నిరుపేదలకు మంజూరు చేసిన పక్కా గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ శ్రీధర్‌రావు అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని కలిచెర్ల, ఎన్.ఒ. పల్లి, కోటకాడపల్లి, వెలిగల్లు గ్రామ సచివాలయము ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో గల జగనన్న లేఅవుట్లలో పక్కాగృహాలు మంజూరైన మొదలు పెట్టనివారు వెంటనే నిర్మాణాలు మొదలు పెట్టేలా బాధ్యత సచివాలయ సిబ్బందిదేనని అన్నారు. పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపిపి పూర్ణచంద్రిక, రమేష్, హౌసింగ్ ఎఇ సందీప్, సర్పం చ్‌లు విశ్వనాథ్, పద్మావతి, భూదేవి, సరస్వతి, పంచాయతీ కార్యదర్శులు, ఖాదర్ భాష, తెలజ, సోమశేఖర్, ప్రసన్నలక్ష్మి, బాలాజీ, ఓబులమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే

వాల్మీకిపురం : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పిపిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మదనపల్లికి చెందిన ధాత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లను ఎమ్మెల్యే చింతల చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ వ్యాధి నివారణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలలో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా వారి వంతు కృషి చేస్తున్నారన్నారు. మదనపల్లికి చెందిన ధాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ప్రతి నెల 50 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఆరు నెలలపాటు ఉచితంగా పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. క్షయవ్యాధి గ్రస్తులు క్రమం తప్పకుండా డాక్టర్ల పర్యవేక్షణలో చికిత్సలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి, డాక్టర్ రమేష్ బాబు, ధాత్రి ఫౌండేషన్ టీం సభ్యులు మురళి, రమణ, సరయు, టిబి యూనిట్ వైద్య సిబ్బంది మురళి, నాగిరెడ్డి, సిహెచ్‌ఒ అమృత, మౌనిక, సృజన, రూప, ఏఎన్ఎం సరోజమ్మ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

క్రిస్మస్ పండగను పురస్కరించుకొని స్థానిక సిఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు ప్రభుచరణ్ నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. క్రిస్మస్ పండగ సమయంలో ప్రతి క్రైస్తవుడు తమ శక్తివంచన లేకుండా సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. క్రిస్మస్ పండుగ ప్రపంచంలోనే అతి పెద్ద పండుగని, యేసు క్రీస్తు లోకానికి బోధించిన సేవ, దయ, జాలి, ప్రేమ, క్షమాపణ ప్రతి క్రైస్తవుడు పాటించి, వాటిని ఆచరించాలన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - కలికిరి

పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం నందు ముస్లిం మైనార్టీ సోదరుడు వెంపల్లి ఫయాజ్, వేంపల్లి బాబాజీ, ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మత బేధాలకు తావు లేకుండా అన్ని మతాలు ఒకటే, అందరి రక్తము ఒకటే నినాదానికి స్ఫూర్తి స్వామివారి భగవంతుని దయవలన [illegible] చేసినట్లు తెలిపారు. అయ్యప్ప భక్తులకు అన్నదానం చేసే అవకాశం కల్పించి నందుకు సంతోషంగా ఉందన్నారు.

ప్రపంచ గణిత మేధావి రామానుజన్

ప్రజాశక్తి- రాజంపేట

రాజంపేటలో 20వ శతాబ్దపు ప్రఖ్యాత గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ జన్మదినోత్సవాన్ని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల, లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ మాట్లాడుతూ గణితశాస్త్రంలో రామానుజన్ పరిశోధనలు అనేక కొత్త ఆవిష్క రణలకు కారణమని, ఆయన శుద్ధ గణితం, రింగ్ థియరీ, స్ట్రింగ్ థియరీలో చేసిన పరిశోధనలు కొత్తతరం క్యాన్సర్ అధునాతన పరిశోధనలలో ఉపయోగప డుతు న్నాయని ఆయన పేర్కొన్నారు. కళాశాల టచ్ స్టోన్ విభాగం వారు గణిత శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అప్లికేషన్స్ ఆఫ్ మ్యాథమ్యాటిక్స్ అనే అంశంపై పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ పోటీ పరీక్షలలో టి భద్రీనాథ్, బిటెక్ నాల్గో సంవత్సరం సిఎస్ఇ ప్రథమ బహుమతి, వి హర్షవీణ, బిటెక్ ద్వితీయ సంవత్సరం ఎఐఎంఎల్, తృతీయ బహుమతి బి.ప్రసన్న లక్ష్మీ, బిటెక్ మొదటి సంవత్సరం ఎఐటిఎస్ సాధించారు. ప్రతిభచాటిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణ ప్రశంస పత్రాలను అందజేసి విద్యార్థులను అభినం దించారు. కార్యక్రమంలో హెచ్ అండ్ఎస్ విభాగాధిపతి డాక్టర్ బి. బాలనాగేంద్ర ప్రసాద్, టచ్ స్టోన్ కో-ఆర్డినేటర్ పి.విజయ్‌కుమార్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **వీరబల్లి :** ప్రపంచ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదిన వేడుకలు గురు వారం గ్రంధివాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ప్రధానో పాధ్యాయులు, ఉపాధ్యా యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు రమేష్‌నాయక్, గైబు సాహెబ్, సుబ్బారెడ్డి గార్లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు రాజన్న, కళ్యాణ చక్రవర్తి, శివశంకర్, చంద్రావతి, మక్బూల్ బాషా, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. క్విజ్ విజే తలకు బహుమతులు అందించారు. **లక్కిరెడ్డిపల్లి :** ప్రతివిద్యార్థి తమ ఇంటిదగ్గర, పాఠశాలలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ పేర్కొన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శ్రీనివాస రామానుజన్ జన్మదిన పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. పాఠశాలల్లో కొబ్బరి మొక్కలు నాటారు. వ్యాసరచన డ్రాయింగ్ పోటీ లలో విజేతలకు బహు మతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జమ్రుద్‌బేగం, సుధాకర్, సుజాత ,శివశంకర్‌రెడ్డి, సుమియబాను, ఆసిఫా, నాగయ్య అరుణ కుమారి, శ్రీని వాసులు, మురళినాయక్, భారతి, సుధీర్‌కుమార్, రసూల్ ఉమా మహేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు. **రాయచోటి :** పట్టణంలోని బోస్‌నగర్ నారా యణ పాఠశాలలో భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సంధర్భంగా జాతీయ గణిత దినో త్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎజిఎం బి.చెన్నకేశవరాజు, ప్రిన్సిపల్ ఎస్.ఖాదర్‌వలి, డి.శంకర్‌రెడ్డి, ఎఓపి నరసింహులు, అకడమిక్ డీన్ యువరాజు, వైస్ ప్రిన్సిపల్స్ సుగణవేణి, నందిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కొత్తపేటలో..** విఆర్ విద్యాసంస్థలలో జాతీయ గణితదినోత్సవం, ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ తులసి, ఉపాధ్యా యులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు. **నందలూరు :** గణిత దినోత్స వాన్ని జ్యోతిబా పూలే బిసి గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. గణితంపై నృత్య ప్రదర్శనలు, గణితంపై ఎగ్జిబిషన్, నాటకాలు విశేషంగా ఆకట్టు కున్నాయి. కార్యక్రమంలో ఎటిపి అపర్ణ, ఉపాధ్యా యులు భ్రమరాంబ, గీత, శ్రావణి, ధనుం జయమ్మ, సుమిత్ర, రాధిక పాల్గొన్నారు. **పుల్లంపేట :** పుల్లంపేట మండల పరిధిలోని అనంతం పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామా నుజన్‌కు ఇష్టమైన నెంబర్ 1729. ఆమరఎ ఇష్టమైన నంబరుతో విద్యార్థుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్య క్రమంలో పాఠశాల ప్రధా నోపాధ్యా యురాలు విజయలక్ష్మి గణితం ఉపా ధ్యాయుడు హరి నాగభూషణం పద్మనాభయ్య తదితరులు పాల్గొ న్నారు **.కురబలకోట:** విద్యార్థులు గణితం యొక్క ప్రాముఖ్యత ను తెలుసుకోని వినూత్న ఆలోచనలతో ముందుకువెళ్ళాలని మిట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రామనాథన్ అన్నారు. మిట్స్ కళాశాలలో జాతీయ గణిత దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమం లో చీఫ్ సైంటిస్ట్ ఆఫీ సర్ డాక్టర్ ఈశ్వర్, అసోసియేట్ డీన్ డాక్టర్ తులసీరామ్ నాయుడు, అధ్యా పకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు రూరల్ :** స్థానిక విక్టరీహై స్కూల్ నందు జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ విక్టరీ నరసింహారెడ్డి, ప్రిన్సిపల్ విక్టరీ రామ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులతు పాల్గొన్నారు. **కలకడ:** మండ లములోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) , పాం రెడ్డిగారిపల్లి జిల్లాపరిషత్తు పాఠశాల, ఆదర్శపాఠశాలల్లో శ్రీనివాస రామా నుజన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీనివాసులు రెడ్డి, సరస్వతి, ప్రిన్సిపాల్ మలంగు షావలి, ఉపా ధ్యాయులు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **పెద్దమండ్యం:** మండలంలోని కలిచెర్ల జెడ్‌పి హైస్కూల్లో గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు సోమశేఖర్, రెడ్డిసురేష్, శశికళ, పాల్గొన్నారు. **పీలేరు :** పట్టణంలోని శ్రీభువన విద్యాలయంలో విద్యార్థులు గణితశాస్త్ర దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిం చారు. మన దినచర్యలో గణితానికి చాల ప్రాము ఖ్యత వుందని, గణితం పట్ల ఆందోళన లేకుండా ఇష్టంతో సాధన చేస్తే మంచి ఫలితాలను సాధిం చవచ్చని కరెస్పాండెంట్ ఉమారమాదేవి అన్నారు. విద్యార్థులకు పార్ములాస్, వ్యాసరచన, మ్యాథ్స్‌మారథాన్ పోటీలను నిర్వహించామన్నారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజంపేట : రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పుల్లంపేట : శ్రీనివాస రామానుజన్‌కు ఇష్టమైన నంబరుతో విద్యార్థుల విన్యాసాలు

‘ఇదేం ఖర్మ’కు విశేషస్పందన : ‘నల్లారి’

ప్రజాశక్తి-కలికిరి

ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన లభిస్తోందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గడి, చీకటిపల్లి, గుట్టపాలెం, అమర నాథరెడ్డి కాలనీ, కొత్తపేట, చెరువుముందర గ్రామాలలో ఇదేంఖర్మ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. వైసిపి శ్రేణులు గూండాగిరి చేస్తూ భూకబ్జాలకు పాల్పడుతూ ప్రభుత్వ ధనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక, ఎర్రచందనం, మద్యంలో మాఫియాగా ఏర్పడి ప్రభుత్వ ఆదాయాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. వ్యవసాయరంగం కూడా కుదేలవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులకు ఫించన్‌ను విడతల వారిగా పెంచి గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిదే గెలుపని అన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ ఉపాధ్యక్షుడు కొటాలచంద్ర, మాజీ సర్పంచులు కె.రమణారెడ్డి, గంగయ్య, బి.వెంకటరమణ, నిజా ముద్దీన్,యతేంద్ర, చంద్రారెడ్డి, ఎం.వెంకట్రమణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఇదేమిఖర్మ కార్యక్రమంలో మాట్లాడుతున్న కిషోర్ కుమార్ రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ‘గడికోట’



గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో మ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

ప్రజాశక్తి-అక్కిరెడ్డిపల్లి

జన సంక్షేమమే జగన్ సంకల్పమని ప్రజా సమస్యలకు తన వంతు కృషి చేస్తానని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురు వారం లక్కిరెడ్డిపల్లె మండలం లక్కిరెడ్డిపల్లె 1,2 సచివా లయాల పరిధిలోని బాలాజీ నగర్, ఎస్‌సి కాలనీ, గాండ్లపల్లె, కోర్టు ఏరియా, పాత పెట్రోల్ బంక్, వైఎస్ఆర్ కాలనీ, నలందనగర్‌లలో ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపిపి అంపాబత్తిన రెడ్డెయ్యలతో కలసి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్ళి ప్రజాసంక్షేమ పథకాల గురించి వివరించారు. అందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పెన్షన్లను జనవరి నుంచి రూ.2,750 కు పెంచుతుందని తెలిపారు. కార్యక్రమంలో తాహశీల్దార్ నాగప్రసన్నలక్ష్మి, ఎంపిడిఒ వెంకట రామిరెడ్డి, మార్కెట్‌కమిటీచైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపిపి సమరసిం హారెడ్డి, గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, కో-ఆప్షన్ నెంబర్ సయ్యద్ అమీర్, ఉప సర్పంచ్ రాజారెడ్డి, సంజీవరెడ్డి,ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ విజయభాస్కర్, ఎంటిపిసి సభ్యులు దస్తగిరి, శంకర్‌నాయుడు, జగన్మోహన్ రెడ్డి, సర్పంచులు వెంకటనారాయణరెడ్డి, జనార్దన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాబు, మాజీ సర్పంచులు రామచంద్రయ్యా, దేవేంద్రారెడ్డి, లల్లు యాదవ్, రవిఆచారి, మైనార్టీ నాయకులు సాహెబ్, నభి, జాకీర్, బాబ్జాన్, వాలీద్, మల్లికార్జున్, లక్ష్మీరెడ్డి,రవి, ఉద్యానశాఖఅధికారి నాగమణి, హౌసింగ్ ఎఇ జనార్ధన్, గ్రామసచివాలయ సిబ్బంది, వార్డువాలంటీర్లు, వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాలల హక్కుల గొంతుక పివి.రావు

ప్రజాశక్తి-పీలేరు

మాలల హక్కుల గొంతుక పివి రావు అని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్ తెలిపారు. గురువారం పీలేరు మండల మాలమహానాడు ప్రధాన కార్యదర్శి దప్పేపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పివి రావు 17వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత రత్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, పివి రావు చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల మహనాడు మాలలహక్కుల కోసం, షెడ్యూల్‌కులాల ఐక్యత, హక్కుల కోసం పోరాడుతున్న ఒక సంస్థ అని, దీన్ని పోతుల విఘ్నేశ్వర రావు స్థాపిం చార న్నారు. 2005లో ఢిల్లీ వెళ్ళిన సందర్భంగా గుండెపోటుకులోనై మృతి చెందా రని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాల మహ నాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడు సుబాష్, జిల్లా ఉపాధ్య క్షులు జెట్టి మల్లికార్జున, మండల నాయకులు మద్దెల బాలగంగాధర్, డివి రమణ (టైలర్), అరిపెంట ఆనంద్, గుండ్లూరు రవీంద్ర, టి. శేషాద్రి, పల్లం ఎల్లప్ప, జి. రాజేంద్రబాబు, జి. విజయ్, జి. రవీంద్రబాబు, పాటూరి ప్రసాద్, పాల్గొ న్నారు. **కలికిరి :** స్థానిక మండలంలో మాల మహానాడు వ్యవస్థాపకులు పి.వి.రావు 17వ వర్ధంతి అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పి.వి.రావు ఎస్‌సి వర్గీకరణ కు వ్యతిరేకంగా మాల మహానాడు స్థాపించి ఎన్నో పోరాటాలు చేశారు. మాలల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేసి అమరుడైన వీరుడు పి.వి రావు పోరా టాన్ని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్క మాల సోదరుడు ఐక్యమత్యంగా ముం దుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు రాయలసీమ గౌరవ అధ్యక్షులు హరి , దామోదర్ , సహదేవ, హరి రామ్ , భాను, సుబ్బు, అనిల్, ప్రసాద్, రెడ్డప్ప, విద్యార్థి భాగం నాయకుడు మలతోటి నరేష్ పాల్గొన్నారు. **వాల్మీకిపురం:** వర్గీకరణకు వ్యతిరేకంగా ప్రతి ఒక్క మాలలను ఏకం చేసి పోరాటం చేసిన డాక్టర్ పివి రావు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి వీరభద్రయ్య, జిల్లా అధ్యక్షులు శివయ్య అన్నారు. మాలమహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పివి రావు 17వ వర్ధంతి ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పివి రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.మాలల ఐక్యత కోసం ఎన్నో పోరాటాలు చేశారని కొనియడారారు. ఎస్‌సిల ఐక్యతే ధ్యేయంగా పనిచేశారని అన్నారు. ఆయన ఆశయాలే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దిలీప్ కుమార్, సునీల్ కుమార్, బివి రమణ, కిరణ్, బబ్లు, మల్లికార్జున, ప్రభాస్ పాల్గొన్నారు.



పి.వి.రావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మాలమహానాడు నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి శ్రీదేవి రవికుమార్

అనీమియాపై అవగాహన

ప్రజాశక్తి -కలకడ

అనీమియాపై విద్యార్థులకు అవగాహన అవసరమని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొన్నారు. మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. కార్యక్రమంలో ఎంపిపి పాల్గొని మాట్లాడారు. ఈ వ్యాధి పట్ల అవగా హన కోసం ప్రతి పాఠశాలలో వైద్యబృందం పర్యటించి తగు సూచనలు, సల హాలు ఇవ్వాల్సిన అవసరముందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న గోరుముద్ద, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, హ్యాండ్ వాషింగ్ టెక్నిక్స్, గుడ్ టచ్ అండ్‌బ్యాడ్‌టచ్ అనే విషయాలపైన కూడా పిల్లలకు అవగాహన కల్పించాల న్నారు. విద్యార్థుల్లో పోషకాహార సమతుల్యతను పెంపొందించే విధంగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ మునీంద్రనాయక్, ప్రధానో పాధ్యా యులు సరస్వతి, ఎంపిఎం రమేష్, వెల్ఫేర్‌అండ్‌ఎడ్యుకేషన్ అసిస్టెంట్ రామాం జనేయులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా హనీఫ్

ప్రజాశక్తి-కలికిరి



టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్ హనీఫ్

టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా షేక్‌హనీఫ్‌ను నియ మిస్తూ టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చె న్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా హనీఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. రాష్ట్రంలో పార్టీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎమ్ఐషోరూం వ్యవస్థాపకులుగా, ముస్లిం మైనార్టీ జెఎసి ఏర్పాటు చేసి పలు సామా జిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. ముస్లిం మైనార్టీ సభ్యులతో పాటు పలువురు హనీఫ్‌ను అభినందించారు.

ఉచిత శిక్షణ తరగతులు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రాష్టంలోని నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ, ఉద్యోగ ఉపాధి కల్పనా నిమిత్తము అన్ని అసెంబ్లీ నియోజకవర్గములలో స్కిల్ హబ్ లను ఏర్పాటు చేసినట్లు ఐటిఐ ప్రిన్సిపల్ శేషారెడ్డి తెలిపారు. నియోజకవర్గంలో రాష్ట్ర నైపు ణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో స్కిల్ హబ్‌ని ఏర్పాటు చేసి అందులో టైలరింగ్ కోర్స్ పైన శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకా శాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు జరుగు తాయని పేర్కొన్నారు. అసక్తి కల్గిన యువతీ, యువకులు 8వ తరగతి పాస్ అయి వారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు9618655759 సి.ప్రమీల 9346510616 నంబరును సంప్రదించాలని తెలిపారు.



కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న దినేష్ కుమార్

కృత్రిమ అవయవాలు పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఒమేగా రెహాబ్ ఫెడరేషన్ సహకారముతో పుల్లంపేట విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం ఆధ్వర్యములో కృత్రిమ అవమవాలు పంపిణీ చేశారు. ఈసందర్భముగా ఒమేగా రెహాబ్ ఫౌండర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ సంఘం అధ్యక్షుడు సుబ్బనరసారెడ్డి ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ అవయవాలు అందించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. వాకర్ సాయంతో నడిచే విభిన్న ప్రతిభావంతులు కృత్రిమ కాలుతో నడవడం సంతోషకరమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తా మని చెప్పారు. లబ్ధిదారుడు నారాయణ మాట్లాడుతూ నేను గతంలో వాకర్ పట్టు కొని నడిచేవాడినని ఇప్పుడు కృత్రిమ కాలు ఏర్పాటు చేయడం ద్వారా సొంతంగా నడవడానికి వీలయిందని తెలిపారు. ఈసందర్భముగా సుబ్బన రసారెడ్డి మాట్లా డుతూ ఒమేగా రెహాబ్ ఫౌండేషన్ ద్వారా కృత్రిమ కాళ్ళు అందిం చడం గొప్ప కార్యక్రమమని పేర్కొన్నారు. 20 మంది విభిన్న ప్రతిభావంతులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశామని చెప్పారు. భవిష్యత్తులో తమ సంస్థ ఆధ్వర్యంలో మరిన్నీ కృత్రిమ అవయవాలు ఇచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమము నందు ఆర్గనైజర్ శామ్యువల్, కో-ఆర్డినేటర్ మురళీ, అన్నం చిన్న సుబ్బయ్యయాదవ్, ఉపా ధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసింహులు, రాజంపేట ఉపాధ్యక్షుడు ఖాదర్‌బాష, బాలాజి పాల్గొన్నారు.

క్రైం కార్నర్



పట్టుబడిన నిందితులు, వాహనం, ఎర్రచందనంతో ఎఫ్ఎస్‌డి బృందం

ఇద్దరు ఎర్రచందనం దొంగలు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

రూ.16 లక్షలు విలువ చేసే ఎర్రచందనం దుంగలతో సహా ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. గురువారం స్థానిక అటవీశాఖ నిఘావిభాగం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం రాత్రి తమకు అందిన సమా చారం మేరకు చిత్తూరుజిల్లా సోమల-కందూరు మార్గంలో కాపు కాచామన్నారు. ఈ క్రమంలో అటువైపుగా వచ్చిన వాహనం తమను చూసి వేగంగా దూసు కెళ్లిందని తెలిపారు. తమ సిబ్బందితో సహా ఆ వాహనాన్ని వెంబడించి, వాహ నంతో సహా తమిళనాడుకు చెందిన ఆర్.రాజీవ్‌గాంధి, ఎస్ గోపి అనే ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. వారిద్దరిని అరెస్టు చేసి, వాహనంలోని 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈ దాడిలో డ్రైవరుతో సహా మరో తొమ్మిది మంది పరారయ్యారని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం దుంగలతో సహా వాహనం విలువ రూ.16 లక్షలు ఉంటుందని చెప్పారు. ఈదాడుల్లో ఎఫ్‌బిఒలు కె.ప్రతాప్, ఎస్ కుప్పస్వామి, ప్రొటెక్షన్ వాచర్లు ఏ.దేవేంద్ర, చరణ్, టి.ప్రభుదేవ్, మల్లికార్జున, సుబ్రమణ్యం, పాల్గొన్నారు.



సమర్థవంతంగా బందోబస్తు నిర్వహించాలి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమర్థవంతంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని ఎస్‌పి అన్బురాజన్ పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో ప్రత్యేక సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి జిల్లాకు విచ్చేసింది మొదలు తిరిగి వెళ్లేంత వరకు చేపట్టాల్సిన బందోబస్తును సెక్టార్ల వారీగా విభజించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా రూపొందించిన బందోబస్తు ప్రణాళికను వివరిస్తూ సెక్టార్ల వారీగా విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

హామీల అమలేదీ?



- అమలుకు నోచని చక్కెర పరిశ్రమ హామీ
- ప్రశ్నార్థకంగా కడప నగర రోడ్ల విస్తరణ
- స్ట్రోమ్ డ్రెయిన్ల హామీ అటకెక్కిన వైనం
- సాగుతున్న...రిమ్స్ సూపర్‌స్పెషాలిటీ పనులు
- ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ పనులకు మోక్షమెప్పుడో?
- నేడు జిల్లాలో సిఎం జగన్ పర్యటన



కమలాపురం బ్రిడ్జి దుస్థితి (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. 2019 పాదయాత్ర సందర్భంగా ప్రతిపక్ష నాయకుని హోదా దగ్గర నుంచి నేటి వరకు జిల్లా అభివృద్ధికి ఇచ్చిన హామీలు, ముఖ్యమంత్రి హోదాలో చేసిన శంకుస్థాపనల వరకు నిధుల విడుదల, పెండింగ్ పనుల పురోగతి నిమిత్తం ఇచ్చిన హామీలు అమలుకు ఆమడదూరంలో ఉన్నాయని చెప్పకోవచ్చు. కడప నగరంలోని నాలుగు ప్రధాన రహదారుల విస్తరణ పనులకు నిధుల కొరత వెంటాడుతోంది. కడప నగరంలో నాలుగు స్ట్రోమ్‌వాటర్ డ్రెయిన్లు, ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ భవన నిర్మాణ ఏర్పాటు, రిమ్స్ సూపర్‌స్పె షాలిటీ సేవలు, చెన్నూరు చక్కెర పరిశ్రమ పునరుద్ధరణ హామీలు అమలుకు ఆమడదూరంలో నిలవడం ఆందోళన కలిగిస్తోంది. వీటికితోడు రూ.454 కోట్ల రిమ్స్ బోధనాస్పత్రి, సైక్రియాటిక్, కేన్సర్‌బ్లాక్, సూపర్ స్పెషాలిటీ బ్లాక్ పనులు, రాజీవ్‌పార్క్ పనులు, కొప్పర్తి పైప్‌లైన్ పనులు, హజ్‌హౌస్ పెండింగ్ పనులు, గోపవరంలో సెంచూరి ఫ్లై వుడ్స్ పరిశ్రమలు, అడుగు ముందుకు పడని వైనం విస్మయాన్ని కలిగిస్తోంది. శుక్ర, శని, ఆదివారాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో కథనం.

⇨ చెన్నూరు చక్కెర పరిశ్రమ పునరుద్ధరణకు హామీ అటకెక్కింది. మూడు కమిటీలు ముచ్చగా సర్వే చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. పునరుద్ధరణ పనులకు రూ.60 కోట్లను విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది.

⇨ 2007లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సర్కారు తలపెట్టిన రూ.72 కోట్లతో కడపలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ పెండింగ్‌లో ఉంది. రాంకీ కాంట్రాక్టు సంస్థ టెండరును దక్కించుకుంది. 2015 నాటికి 68 శాతం పనులు పూర్తి చేసింది. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బి శాఖల అవాంతరాల నేపథ్యంలో చేతులెత్తేసింది. టిడిపి సర్కారు 2018లో హైదరాబాద్‌కు చెందిన శ్రీసాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీకి 108.41 కోట్లతో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ కాంట్రాక్టును దక్కించుకున్నప్పటికీ ఎటువంటి స్పందన లేకుండా పోయింది.

⇨ రూ.305 కోట్లతో కడపలోని అన్నమయ్య సర్కిల్, గోకుల్ లాడ్జి సర్కిల్, మాసాపేట సర్కిల్, వైజంక్షన్ సర్కిల్‌లోని రహదారుల విస్త రణ పనులు టెండర్లు దశను దాటడం లేదు.

⇨ రూ.70 కోట్ల విలువైన స్ట్రోమ్‌డ్రెయిన్‌ల ఏర్పాటు హామీ అటకెక్కింది. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాల ధాటికి నగరం మునుగుతోంది. కడపలో స్ట్రోమ్‌డ్రెయిన్ కాల్వల ఆక్రమణలను తొలగించి విస్తరణ పనులు చేపట్టడానికి ఇచ్చిన హామీ నిధులు లేక నీరోడుతోంది.

⇨ రూ.454 కోట్ల విలువ కలిగిన రిమ్స్ బోధనాస్పత్రి, కేన్సర్, సైక్రి యాటిక్, సూపర్‌స్పెషాలిటీ హోదా పనులు సా..గుతూనే ఉన్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది.

⇨ రూ.345 కోట్లతో కూడిన ఆర్కిటెక్చర్ యూనివర్శిటీ పనులకు ఆర్కిటెక్ట్ దశను దాటలేదు. ఫలితంగా యూనివర్శిటీ నిర్మాణం ఎప్పటికి సాకారమ వుతుందో తెలియని దుస్థితి ఏర్పడింది.

⇨ రూ.12 కోట్లతో కూడిన హజ్‌హౌస్ పెండింగ్ పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. నిధుల లేమి కారణంగా సకాలంలో పూర్తి చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

⇨ రూ.150 కోట్ల విలువ కలిగిన కొప్పర్తి పారిశ్రామికవాడ నీటిపైప్ లైన్ పనులపై అయోమయం నెలకొంది. కొప్పర్తిలో పరిశ్రమల ఏర్పాటుకు నీటి కొరత కారణంగా జంకుతున్న వైనం విస్మయాన్ని కలిగిస్తోంది.

⇨ కొప్పర్తి పారిశ్రామికవాడలోని వైఎస్ఆర్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు ఎప్పటికి కార్యకలాపాలు సాగిస్తాయో తెలియడం లేదు. చెప్పుకోదగిన రీతిలో నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చిన దాఖలా ల్లేవు.

⇨ కడప, ప్రొద్దుటూరు పాలపరిశ్రమల కార్యకలాపాలు ఆశించిన రీతిలో సాగడం లేదు. ప్రొద్దుటూరులో మూలన పడిన పాల పరిశ్రమ ఆస్తుల తనఖా పెట్టిన నేపథ్యంలో సుమారు రూ.90 కోట్లు చెల్లింపులకు నోచుకోకపోవడం లేదు. జగనన్న పాలవెల్లువ వంటి పథకంలో భాగంగా పునరుద్ధరణ కార్యకలాపాలను వేగవంతం చే యాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

⇨ కడపలో రెండవ ఆర్టీసీ డిపో, సిటీ బస్సుల సదుపాయాలు అందని ద్రాక్ష చందంగా ఊరిస్తుండడం గమనార్హం. జిల్లావాసే ఆర్టీసీ కార్పొ రేషన్ ఛైర్మన్‌గా మల్లికార్జునరెడ్డి రావడంతో ఆశాభావం వ్యక్తమవుతోంది.

⇨ 12 కోట్లతో కూడిన బుగ్గవంక ప్రహరీకి ఇరువైపులా రహదారి నిర్మాణ పనులు ఆశించిన రీతిలో సాగలేదు. బ్యూటిఫికేషన్, లైటింగ్ సిస్టమ్ వంటి పనులు ఎప్పుడు ఏర్పడతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది.

⇨ జిఎన్‌ఎస్‌ఎస్ ఫేజ్-1లో భాగమైన సర్వరాయసాగర్, వామికొండ రిజ ర్వాయర్లు ఎప్పటికి సాకారమవుతాయో తెలియడం లేదు. ఇటీ వల జిల్లా నీటిపారుదలశాఖ రూ.212 కోట్లతో కూడిన ప్రతిపాదనలు పంపించినప్పటికి పాలనాపరమైన అనుమతుల మంజూరు కోసం నిరీక్షించాల్సి వస్తోంది.

పేద విద్యార్థులందరికీ డిజిటల్ విద్య

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలలో చదువుతున్న పేద విద్యార్థులకు భవిష్యత్తులో డిజిటల్ విద్య అందించడమే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా పేర్కొన్నారు. గురువారం విద్యాశాఖ, సర్వ శిక్ష ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ బాలుర ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత ప్రాంత పార్టీలకు అతీతంగా, ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పేద విద్యార్థిని, విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మదిలో కలిగిందని చెప్పారు. 2025 విద్యాసంవత్సరంలో సిబిఎస్‌ఇ విధానంలో ఇంగ్లీష్ మీడియంలో పదవ తరగతి పరీక్ష రాసేలా పిల్లలను సన్నద్ధం చేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్నారు. పేద విద్యార్థులు సైతం డిజిటల్ విద్యను అందుబాటులోకి తెస్తూ, తరగతి గదులలోనే చెప్పే పాఠాలను ఇంటికి వెళ్లినా పిల్లలు మరింత క్షుణ్ణంగా నేర్చుకునేందుకు వీలుగా ట్యాబ్‌లు అందజేస్తున్నారని చెప్పారు. నగర మేయర్ కె సురేష్ బాబు మాట్లాడుతూ విద్య ఉంటేనే భవిష్యత్తు ఉంటుందని నమ్మిన ముఖ్యమంత్రి ట్యాబ్‌లను అందిస్తున్నారని చెప్పారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అధిక నిధులను కేటాయిస్తున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి దేవ రాజు, సర్వ శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల విద్యలో మరో విప్లవాత్మక కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాలో 17, 133 మంది 8 వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు 2015 మంది ఎనిమిదో తరగతి బోధించే ఉపాధ్యాయులకు ఈ ట్యాబులను ఉచితంగా ప్రభుత్వం పంపిణీ చేస్తోమని చెప్పారు. కడప మండలానికి సంబంధించి 2509 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ,199 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఉచితంగా అందజేస్తామన్నారు.



విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

'ముఖ్యమంత్రి గారూ.. కాస్త కనికరించండి'

అంగన్వాడీ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

'ముఖ్యమంత్రి గారూ.. అప్పులు చేసి అంగన్వాడీ కేంద్రాలను నడుపుతున్నాం.. కాస్త కనికరించి నిధులు మంజూరు చేయండి' అంటూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి కోరారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి అంగన్వాడీ సమస్యలపై స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఆరు నెలల నుంచి సెంటర్లకు కూరగాయల బిల్లులు చెల్లించలేదని, అప్పులు చేసి సెంటర్లను నిర్వహిస్తున్నామని తెలిపారు. బడ్జెట్ వచ్చినా కూడా బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. తద్వారా టీచర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సెంటర్ బాడుగలు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. యజమానులతో ఇబ్బందికరంగా ఉందని, జిల్లాలో గ్యాస్ స్టవ్ ల సరఫరా అరాకొరగా ఉన్నదని పేర్కొన్నారు. ఎర్రగుంట్లలో వైఎస్ఆర్ కిట్లు అరకొర ఇవ్వడంతో లబ్ధిదారులతో ఇబ్బందికరంగా ఉన్నదని తెలిపారు. 3జి సెల్లులు ఇచ్చారని అవి సక్రమంగా పనిచేయలేదని చెప్పారు. ప్రతి పిల్లవాని కి బరువులు చూపెట్టాలని నెట్టు సరిగా రావడం లేదని ఆమె తెలిపారు. కరోనా సమయంలో రెండు నెలల జీతాలు 10 శాతం కట్ చేశారని, ఇప్పుడు మిగతా ఉద్యోగస్తులు అందరికీ ఆ జీతం ఇచ్చారని, అంగన్వాడి టీచర్లు ఏం పాపం చేశామని మాకు ఇవ్వలేద ని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీ పోస్టులను నెలల తరబడి భర్తీ చేయకపోవడం వలన పని భారం ఇతర టీచర్లపై పడుతున్నదని, తక్షణమే పోస్టులను భర్తీ చేయాలని, మినీ వర్కర్స్ కు ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని భారం ఒకపక్క, సొంత డబ్బులతో సెంటర్లను నడుపుతున్నామని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని పెండింగ్లో ఉన్న కూరగాయల బిల్లులను చెల్లించి, అంగన్వాడి టీచర్లకు న్యాయం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మీదేవి, కోశాధికారి అంజనీ దేవి, సీనియర్ నాయకులు ఐఎన్ సుబ్బమ్మ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

చొప్ప గంగిరెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

విద్యా రంగంలో చేస్తున్న సేవలకు గుర్తింపుగా మలేషియా దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమై సెయింట్ మదర్‌థెరిసా విశ్వవిద్యా లయం నుంచి గౌరవ డాక్టరే ట్‌ను స్వీకరించి మొదటి సారిగా కడప అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలకు విచ్చేసిన సందర్భంగా డాక్టర్ చొప్ప గంగిరెడ్డిని కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చొప్ప గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో అత్యుత్తమ శిక్షణ ఇస్తూ విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. అనేక మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు, కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మం చొప్ప ఎల్లారెడ్డి,అన్ని విభాగాధిపతుల అధ్యాపకులు పాల్గొన్నారు.



చొప్ప గంగిరెడ్డిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

రిమ్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

కడప సిటీ :కడప నగరశివారులోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ రిమ్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్య క్రమానికి ముఖ్యతిథులుగా ఆస్పత్రి సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. యేసుక్రీస్తు జన్మించిన సందర్భంగా నిర్వహించుకునే ఈ పండుగ ఎంతో పవిత్రమైందని తెలిపారు. ఆయన్ను కరుణారస మూర్తిగా, దయామూర్తిగా భావించి నిత్యం ప్రార్థనలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందరూ ప్రపంచ శాంతి కోసం పాటు పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఒలు డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ గీత, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు గ్రేడ్-1 మాధురీలత, గ్రేడ్-2నర్సింగ్ సూపరింటెండెంట్ శ్రీకాంత, సీనియర్ అసిస్టెంట్లు ప్రభుదాస్, రవికుమార్, రిమ్స్ నర్సింగ్, జూనియర్ అసిస్టెంట్ ప్రదీప్,హెల్త్ సూపర్‌వైజర్ రమణయ్య పాల్గొన్నారు.



సెమిక్రిస్మస్ వేడుకల్లో రిమ్స్ వైద్యులు, సిబ్బంది

గ్రంథాలయాల్లో ఆకస్మిక తనిఖీ

కడప అర్బన్ : నగరంలో శాఖ గ్రంథాలయాలను, పుస్తక నిక్షిప్త కేంద్రాలను జిల్లా గ్రంథాలయం సంస్థ ఛైర్ పర్సన్ యల్. ఉషారాణి ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం ఐటిఐలో ఉన్న ఓపెన్ స్కూల్‌లో, తిలక్ నగర్, మృత్యుంజయ కుంట, కొండాయపల్లి, నబీకోటలో ఉన్న పుస్తక నిక్షిప్త కేంద్రాలను తనిఖీ చేశారు. పుస్తక నిక్షిప్త కేంద్రాల నిర్వాహకుల పట్ల ఛైర్ పర్సన్ అసంతృప్తిని వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని, నెలకు రెండు పర్యాయాలు పుస్తకాలను సంబంధిత గ్రంథాలయాల నుంచి తీసుకువెళ్లాలని సూచించారు. ఓంశాంతి నగర్‌లో వున్నా మహిళా గ్రంథాలయం, బాల బాలికల గంథాలయం, చిన్న చౌక్ లైబ్రరీలను సందర్శించి రికార్డుల పరిశీలించారు. ప్రతి ఆదివారం "చదవడం మాకు ఇష్టం" ప్రోగ్రాం ను నిర్వహించాలని ప్రతీ నెల మొదటి శనివారం 'మనం మన గ్రంథాలయం' ను ప్రోగ్రామ్ లను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యదర్శి ఎస్. అమీరుద్దీన్ ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ ఉషారాణి

కాపులకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

కడప అర్బన్ : ఆర్థికంగా వెనుకబడ్డ అగ్రవర్ణ కులాలకు 10 శాతం ఇడబ్ల్యుఎస్ కేంద్రం కేటాయించగా ఇందులో 5 శాతం కాపులకు రిజర్వేషన్లు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చారని, రాష్ట్రంలోని కాపులకు వైయస్ జగన్మోహన్ రెడ్డి మోసం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి హరి ప్రసాద్ విమర్శించారు. గురువారం నగరంలోని హరి టవర్స్ లో విలేఖరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు శాతం కాపు రిజర్వేషన్ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో లేదని, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని తప్పుడు ప్రచారంతో తుంగలో తొక్కారని విమర్శించారు. పార్లమెంటు సమావేశంలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ అంశం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోనే ఉంటుందని కేంద్రం తేల్చి చెప్పిందన్నారు. జగన్ అధికారం చేపట్టిన తర్వాత అగ్రవర్ణ కులాల పేదలు 56 వేల మంది అర్హులు కాగా అందులో కాపు బలిజల 28 వేల మంది ఉద్యోగాలు కోల్పోయారన్నారు.

డిఎల్ ఆరోపణలు కుట్రపూరితం : ఎమ్మెల్యే

కడప :మాజీ మంత్రి డి.ఎల్. రవీంద్రారెడ్డి వైసిపిపైనా, ముఖ్యమంత్రిపైనా చేసిన ఆరోపణలు కుట్రపూరితమైనవని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. డిఎల్ పెద్ద అవినీతి వరుడని ఆరోపించారు. గురువారం స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడతూ 2014లో ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి సుధాకర్ యాదవ్ గెలుపు కోసం డిఎల్ సతీమణి సుభద్రమ్మ జనరల్ ఏజెంటుగా పనిచేశారు అన్నారు. 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరి, ఎన్నికల సమయంలో టిడిపికి ఓటేయమని చెప్పితనకు, పార్టీకి ద్రోహం చేశారని వాపోయారు. ఇప్పుడు పార్టీలో ఉన్నానని చెప్పుకోవడం సిగ్గుచేటని చెప్పారు. కాంగ్రెస్‌లో మంత్రిగా ఉంటూ జగన్ పై ఎంపీగా పోటీసి డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారని విమర్శించారు. సమావేశంలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ యానాదయ్య, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినికి సాయం

కడప అర్బన్ :నగరానికి చెందిన బాసట సేవా సంస్థ మిత్రులు, దాతలు, సభ్యుల సహకారంతో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. బాసట దత్తత గ్రామం ఎం.ఎస్. కొట్టాలకి చెందిన కావలి సౌభాగ్య ఇటీవల కడప విజయదుర్గ కాలేజీలో బిఎస్‌సి నర్సింగ్ చదవటానికి అర్హత సాధించింది. ఆర్థిక కారణాలతో ఇబ్బందిపడుతున్న తండ్రి సుబ్బయ్య బాసట సంస్థ కీలక సభ్యులు డి.ఎ. కార్తీక్ రెడ్డి, డి. నరసారెడ్డి ని సంప్రదించారు. వారు రూ. 30,600 చెక్కు రూపంలో అందచేశారు. కార్యక్రమంలో బాసట ప్రతినిధులు యస్.మధు సూదన రెడ్డి, బాలాజీరావు పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఇఎ అధ్యక్షులుగా కాకర్ల వెంకట్రామిరెడ్డి

కడప అర్బన్ : ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఎపిఎస్‌ఇఎ) అధ్యక్షులుగా కాకర్ల వెంకటరామిరెడ్డి 288 ఓట్ల మెజార్టీతో ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో ఛైర్మన్ లెక్కల జమాల్ రెడ్డి ,రాష్ట్ర ఉపాధ్యక్షులు భూమిరెడ్డి వరదా రెడ్డి, జిల్లా ఛైర్మన్ మోపురి శివారెడ్డి, పిఎస్టియు జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు పివి సుబ్బారెడ్డి ,ఎన్. వి. సుబ్బారెడ్డి, జిల్లాకో ఛైర్మన్ లు వల్లెం సుబ్బారెడ్డి, చల్లా ప్రసాద్ రెడ్డి, పెన్షనర్ అసోసియేషన్ పురుషోత్తం రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవలు ఉద్యోగులు అందించాలని కోరారు.

పరిశోధకుల ప్రమేయంతో సుస్థిర అభివృద్ధి

కడప అర్బన్ :భారతదేశంలో స్థిరమైన అభివృద్ధి ప్రాముఖ్యతపై పరిశోధకులు దృష్టి సారించాలని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వైపి వెంకటసుబ్బయ్య అభిప్రాయపడ్డారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబిఎ శాఖ ఆధ్వర్యంలో ' సస్టైనబుల్ డెవలప్మెంట్ ఇన్నోవేటివ్ మేనేజ్మెంట్ ప్రాక్టీస్ అండ్ స్ట్రాటజీస్' అంశంపై రెండు రోజుల సెమినార్ ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల పరిశోధకులు, నిపుణులు, విద్యావేత్తలను ఉమ్మడి వేదికపైకి తీసుకువచ్చి అభివృద్ధి పై చర్చించాలన్నారు. రెండు రోజుల ఈ వేదిక ఔత్సాహిక యువ పరిశోధకుల జ్ఞానాన్ని వెలిగించిందన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ ఎంబీఏ శాఖ ఆచార్యులు మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీని వాస్, ఎంబీఏ శాఖ సహ ఆచార్యులు, సెమినార్ కన్వీనర్ డాక్టర్ ఎస్వి సుబ్బారెడ్డి, కో-కన్వీనర డా.పి.సరిత సదస్సులోని ప్రాధాన్యత అంశాలను వివరించారు

వైసిపి పాలనలో ఉపాధి కరువు

కడప అర్బన్ : వైసిపి పాలనలో నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కరు వయ్యాయని టిఎన్ఎ స్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ విమర్శించారు. గురు వారం నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో టిఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులతో కలిసి 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు జాబ్ నోటిఫికేషన్ లోని అన్యాయాన్ని, అక్రమాలను, దౌర్జన్యం లను, ప్రశ్నిస్తామన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నగర అధ్యక్షుడు అనిల్, కడప పార్లమెంట్ నాయకులు అష్ఫల్, నగర ఎస్సి సెల్ కార్యదర్శి బిల్లా నవీన్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఇదేంఖర్మ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కడప

స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న నారాయణ స్కూల్‌లో గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని విద్యార్థులకు నంబర్ మానియ పేరుతో నంబ ర్స్ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గీత, ఎజిఎం రాజు, ఆర్ఐ కిరణ్‌కు మార్, ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లితండ్రులు, విద్యారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **పోరుమామిళ్ల:** ప్రపంచమే గర్వపడే వ్యక్తి శ్రీనివాస రామానుజన్ అని ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక సెయింట్ ఆంటోనీస్ స్కూల్ లో జాతీయ గణిత దినోత్సవం వేడుకలు ప్రిన్సిపల్ సునంద రెడ్డి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పోరుమామిళ్ల పట్టణంలోని ఈ విధంగా పాఠశాలల గణిత శాస్త్ర అధ్యాపకులను అతిథులుగా ఆహ్వానించి వారికి సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **పట్టణంలోని శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం, సిబిఎస్ఈ పాఠశాలలో** శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ వేడుకను పాఠశాల కరస్పాండెట్ రామ కృష్ణ , డైరెక్టర్ కల్యాణి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణిత శాస్త్ర ప్రాముఖ్యత ను తెలియజేస్తూ అనేక రకాల ప్రద ర్శనలు విద్యార్థులు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లికార్జున, పాఠశాల ఇన్‌ఛార్జి కేశవరాయుడు , ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొ న్నారు. **కడప అర్బన్:** డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూని వర్సిటీలో గురువారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. శ్రీనివాస రామా నుజన్ చిత్ర పటానికి ఇన్‌ఛార్జి విసి సూర్య కళావతి, రిజిస్ట్రార్ సురేంద్ర నాథ్ రెడ్డి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సూపరి ంటెండెంట్ వై.పవన్ కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నారులతో ప్రిన్సిపల్ గీత

'ప్రగతి'కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వల్లూరు

భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కమలాపురం ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 'విద్యార్థుల్లో మానవ విలువలు పెంపొందించడం ఎలా' అనే అంశాలపై ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు డి.సాగర్, సి.అంకిత, సి.శివ హరిత, పి.మౌనిక ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. భగవాన్ శ్రీ సత్యసాయి మెమోంటో ఇచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కె.బాలమైసూరారెడ్డి, ప్రిన్సిపల్ కె.అనంతరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మైనార్టీల ప్రాణాలకు రక్షణ ఏదీ?

కడప : వైసిపి ప్రభుత్వ పాలనలో మైనార్టీల ప్రాణాలకు రక్షణ కరువైందని అందుకు నిదర్శనం నరసరావుపేటలో ఇబ్రహీం ను హత్య చేయడమేనని కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ ఖాన్, నగర మైనార్టీ అధ్యక్షుడు ఆసిఫ్‌ఖాన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి అనుచరులు చర్చల పేరుతో పిలిపించి హత్య చేయడం దారుణమని వాపోయారు.

సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

సంక్రాంతి సంబరాలు జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓబులేసు, ఐద్వా నగర అధ్యక్షురాలు వసంతకుమారి పిలుపునిచ్చారు. గురువారం పాత బస్టాండ్ లోని కార్యాలయంలో సంబరాల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాదిలాగానే యువజన, విద్యార్థి, మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి సంబరాలు నగరంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సంస్కృతి, సాంప్రదాయం, ఐక్యత, అనురాగాలకు, ప్రతీక సంక్రాంతి పండుగ అన్నారు. కుల, మత వర్గాలను ఏకం చేసే పండుగను సంతోషంగా నిర్వహించుకునేందుకు నగర వ్యాప్తంగా వివిధ రకాల ఆటల, ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత బిజీ జీవనంలో విద్యార్థులు, ప్రజలు ఆటలకు దూరంగా ఉన్నారని తెలిపారు. వారిలో మానసిక ఉల్లాసం పెంపొందించడానికి పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. యువజన, విద్యార్థి, ఐద్వా, ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ సంక్రాంతి సంబరాలు జయప్రదం కోసం ఆర్థిక సహాయ సహకారాలతోపాటు సలహాలు, సూచలు ఇవ్వాలని కోరారు. యువతకు - క్రికెట్ మహిళలకు - ముగ్గుల పోటీలు విద్యార్థులకు - ఆటల పోటీలు పోటీలలో పాల్గొనే అభ్యర్థులు జనవరి 3వ తేదీ లోపల తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. 8639919308, 9866445134, 7799183772, 8341219837, 9502902343, 6281318130, 8008064968, 9493579303లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు విజయ్, శివ, వినోద్, వెంకటేష్, వర్ధన్, ఉదయ్, తేజ పాల్గొన్నారు.

జన వికాస్ సేవా సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని వైఎస్ఆర్ జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాహిర్ ఆధ్వర్యంలో సంస్థ రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా నెహ్రూ యువ కేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ మణికంఠ, వైసిపి నాయకులు కాల్టెక్స్ మహమ్మద్ హఫీజులా, డాక్టర్ సోహైల్ అహ్మద్,ఆల్ ఇండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ జిల్లా అధ్యక్షుడు పి. వి రమణ, బాడీబిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఛైర్మన్ నూనె నాగేష్ హాజరయ్యారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సమితి నాయకులు

పాస్టర్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కడప

న్యూనేటీవ్ కృపా మినిస్ట్రీస్ పాస్టర్ పి. మహేష్ సేవలు సేవలు అభినందనీయమని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. గురువారం సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాస్టర్ కుటుంబంతో కలిసి కుల మతాలకు అతీతంగా పేదలకు అందిస్తున్న సేవలను అభినందిస్తూ జెసి సాయికాంత్ వర్మ డిప్యూటీ మేయర్ బండి నిత్యా నందరెడ్డి, క్రిస్టియన్ మైనారిటీ అధికారులు అర్.వి.కృష్ణ కిషోర్, సుపర్నెట్ మధు సుధన్, సీనియర్ అసిస్టెంట్ సి.హెచ్ డేవిడ్, జూనియర్ అసిస్టెంట్ ఖరిముల్ల, రియాజ్, మస్తాన్ వలీ అభినందించారు. సిఎం జగన్‌తో మాట్లాడి చర్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఆయన జెసికి విన్నవించారు. కార్యక్రమంలో ఫాదర్ అబ్రహం, బిషప్ డానియలు, విజయ భాస్కర్, షడ్రక్ రాజు, బి.ప్రభు దాస్, పి.మహేష్ తో పాటు వాలంటీర్ పి.రవితేజ, అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.



జెసికి సమస్యను విన్నవిస్తున్న పాస్టర్ మహేష్

అథ్లెటిక్స్ పోటీల్లో వేదవ్యాస విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక సైపాఠా రోడ్డులోని శ్రీ వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఈ నెల 20, 21వ తేదీల్లో యోగివేమన యూనివర్సిటీలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ యల్. నాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల 100 మీటర్ల పరుగు పందెంలో వి.నాగనవీన సిల్వర్ మెడల్ (రెండవ స్థానం)సాధించి, సౌత్ వెస్ట్ ఇంటర్ యూనివర్సిటీకి ఎంపికయ్యారన్నారు. మహిళల 4x100 మీటర్ల పరుగు పందెంలో వి.నాగనవీన, సి.హరిచందన, బి.శిరీష, సి.ధనలక్ష్మి సిల్వర్ మెడల్ (రెండవ స్థానంలో) నిలిచారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శనరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె.నాగరాజు, వి.రామలక్ష్మిరెడ్డి, ఎస్‌వి యాసిన్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో కళాశాల యాజమాన్యం

అమృతనగర్‌పై పోలీసులు నిఘా పెట్టాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని అమృతనగర్‌పై పోలీసులు ప్రత్యేకదృష్టి పెట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. పట్టణానికి విసిరేసినట్లుగా ఉండే ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు తరచూ చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణే బుధవారం సాయంత్రం ఓ సంఘటన చోటుచేసుకుంది. ఓ గుర్తు తెలియని వ్యక్తి గ్రామంలోని 14,15 వీధుల్లో, మసీదు ప్రాంతంలో మధురు రోడ్డు 4,5 వీధుల్లో అనుమానాస్పదంగా తిరుగుతూ స్థానికులకు ఆందోళన కలిగించాడు. ఈ క్రమంలో రెండు ఇళ్లల్లోకి ప్రవేశించడంతో వారు దేహశుద్ధి చేసి పంపించినట్లు తెలిసింది. విషయాన్ని స్థానికులు రూరల్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి ఆ గుర్తు తెలియని వ్యక్తిని ఉద్దేశించి నామమాత్రంగా మాట్లాడి పంపించేసినట్లు స్థానికులు తెలిపారు. అమృతనగర్ కేంద్రంగా గతంలో అసాంఘిక కార్యక్రమాలు జరిగిన సంఘటనలున్నాయి. ఈ నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా తిరిగితే తమకు సమాచారం ఇవ్వమని పలుమార్లు పోలీస్ అధికారులు ప్రకటనలు ఇచ్చారు. గుర్తు తెలియని వ్యక్తి గురించి సమాచారాన్ని ఇచ్చినప్పటికీ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎస్ఐ సంజీవరెడ్డిని వివరణ కోరగా.. సమాచారం వచ్చిన వెంటనే ఇద్దరు కానిస్టేబుళ్లను పంపామని, ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉండడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మైనార్టీలపై దాడులు సహించేదిలేదు

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి ప్రభుత్వం మైనారిటీల పట్ల దాడులు చేస్తే సహించబోమని టిడిపి మైనారిటీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కమలాపురం షేక్ ఫరూక్ అహ్మద్ హెచ్చరించారు. స్థానికంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆగడాలను, వైఫల్యాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులో ఇరికించడం తగదన్నారు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయన్నారు. మసీద్ ఆస్తుల సంరక్షణ కోసం పోరాడుతున్న షేక్ ఇబ్రహీంను హత్య చేశారని, ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపు కోసం అందరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మునీర్ అహ్మద్, ఖాజా మొహిద్దీన్, మాబుసాబ్, సిద్ధారం అమీర్ బాషా, నూరుల్లా, షమీవుల్లా పాల్గొన్నారు.

సుధీర్ అరెస్టుపై జ్యుడీషియల్ విచారణ జరగాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక వైఎంఆర్ కాలనీ సాయిబాబా గుడి పక్కన కడుతున్న అపార్ట్‌మెంట్‌పై నుండి ప్రమాదవశాత్తు జారిపడి చనిపోయిన అంజి విషయంలో అరెస్టయిన సుధీర్ విషయంలో స్థానిక పోలీసులు అన్యాయంగా వ్యవహరించారని, దీనిపై జ్యుడీషియల్ విచారణ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దేవదీరాజ్, రాయలసీమ పరిరక్షణ సంఘం ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం వారు పొట్టిపాడు రోడ్‌లోని ఎస్‌సి హాస్టల్ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ చనిపోయిన అంజి కుటుంబానికి, ఆ భవన యజమాని మధ్య ఒక అగ్రిమెంట్ కుదిరిందని ఆరోపించారు. ఈ అగ్రిమెంట్ స్థానిక పోలీసుల సమక్షంలోనే జరిగినట్లు సమాచారం ఉందన్నారు. బాధిత సుధీర్‌పై పోలీసులు ఉద్దేశపూర్వకంగా కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. అక్రమ పద్ధతిలో భవనాన్ని కడుతూ కూలీలుగా తీసుకొచ్చిన విద్యార్థి ప్రాణానికి భవన యజమాని కారణమని, ఘటన ప్రమాదవశాత్తు జరిగినా భవన యజమాని మాత్రమే దీనికి పూర్తి బాధ్యత వహించవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యార్థి సమితి ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు నరసింహ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు దేవదీరాజ్

మొక్కలు మానవ మనుగడకు సోపానాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మొక్కలు మానవ మనుగడకు సోపానాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైయంఆర్ కాలనీలోని డిసిసి బ్యాంక్ ఆవరణలో గురువారం ఆయన మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీ, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీదేవి, వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పి.నరసింహారెడ్డి, ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ నాగేంద్రరెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ మాజీ చైర్మన్ జింకా విజయలక్ష్మి, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టిబాబు, పట్టణ అధ్యక్షులు కోనేటి సునంద, డిసిసి బ్యాంకు సిఇఒ రాజేంద్రకుమార్, బ్యాంకు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కొండాపురంలో వేర్వేరు చోట్ల చోరీలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలో రోజురోజుకు దొంగల బెడద ఎక్కువైంది. కొండాపురం పట్టణంలో బుధవారం రాత్రి రెండిళ్లలో చోరీ చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన పరమేశ్వర ఆచారి విద్యుత్ లైన్‌మెన్ కుటుంబంతో ఎవరూ లేకపోవడంతో గమనించిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఏడుస్తు తులాల బంగారు, రూ.80 వేల నగదు దొంగలించినట్లు పరమేశ్వర ఆచారి తెలిపారు. ఆ ఇంటి పక్కనే ఉన్న అనిల్‌కుమార్ అనే వ్యక్తి కుటుంబంతో సహా షిరిడీకి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు ఆ ఇంటిలో కూడా చోరీ చేశారు. అనిల్‌కుమార్ ఇంటిలో రూ.5000 నగదు పోయినట్లు బాధితుడు చరవాణి ద్వారా పత్రికలకు తెలిపారు. పట్టణంలో రోజురోజుకు దొంగల బెడద ఎక్కువగా ఉంది. ఇందుకు తగు పోలీసు సిబ్బంది లేకపోవడం కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అవసరమైన సిబ్బందిని నియమించాలని, రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. బుధవారం రాత్రి జరిగిన దొంగతనాలపై కడప క్లూస్ టీం ద్వారా విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. చోరీలపై కేసు నమోదు చేసినట్లు సిఐ సుదర్శన ప్రసాద్ తెలిపారు.


బీరువాలో చెల్లాచెదురైన దుస్తులు

శనగ పంటను దున్నేస్తున్న రైతులు

మాండూస్ తుపాను దెబ్బకు రైతులు విలవిల

ప్రజాశక్తి - వేంపల్లె

మాండూస్ తుపాను వల్ల శనగపంట పూర్తిగా దెబ్బతింది. పూత వచ్చే సమయంలో వర్షాలు భారీగా కురవడంతో తేమశాతం ఎక్కువై తెగుళ్లు ఆశించాయి. పంట నల్లగా మారి పోయింది. ఈ పరిస్థితుల్లో రైతులు ఏమి చేయాలో పాలుపోక దెబ్బతిన్న శనగ పంటను ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. మరి కొంతమంది రైతులు పంటను పీకేశారు. మండలంలోని కత్తులూరు రైతులు రబీలో దాదాపు 200 ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా రైతులు రబీలో ఆదాయం పొందవచ్చు అనే ఆశతో శనగను సాగు చేశారు. అధిక వర్షపాతంతో పంట పూత రాలి పోయిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు రూ.15 వేలు ఖర్చు చేశామని రైతులు రామకృష్ణారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, విశ్వనాథరెడ్డి, కవిత, వెంకట్రామిరెడ్డి, సుబ్బలక్ష్మి, రుక్మిణ ఆవేదన వ్యక్తం చేశారు. దెబ్బతిన్న శనగ పంటను దున్నేసి ప్రత్యామ్నాయం చూసుకుంటున్నామని రైతులు పేర్కొంటున్నారు. శనగ పంట ఆశించినరీతిలో దిగుబడి వచ్చింటే ఎకరాకు దాదాపు రూ.40వేలు ఆదాయం పొందవచ్చని తెలిపారు. శనగ పంట ఆశించిన విధంగా ఉండే సమయంలో అకాల వర్షాలు దెబ్బతీశాయని వాపోతున్నారు. పెట్టుబడితో అప్పుల పాలయ్యామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లగా మారిన శనగ పంటను పీకడానికి కూడా కూలీలకు డబ్బుల్లేక ఇంటిలో ఉన్న కుటుంబ సభ్యులతోనే పంటను పీకేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.


శనగ పంటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న కత్తులూరు రైతులు


నల్లగా మారిన శనగ పంటను పీకేస్తున్న రైతు

సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సంక్షేమ పథకాలతోనే పేదల అభ్యున్నతి అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ పరిధిలోని రామాపురం గ్రామం ఎస్‌సి కాలనీ, హరిజనవాడలో గురువారం యాకోబు ఆధ్వర్యంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటి గడపకు ఆయన వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ, సమస్యలపై ఆరా తీశారు. మూడేళ్ల కాలంలో రూ.17 కోట్లతో పంచాయతీని అభివృద్ధి చేశానని, ఈ గ్రామం పట్ల అభిమానం ఉందన్నారు. క్రిస్మస్ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి రూ.4వేలు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఎంపిపి సానబోయిన శేఖర్ యాదవ్, జడ్‌పి వైస్ చైర్మన్ జైష్టది శారద, పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, వైసిపి నాయకులు రామాపురం యాకోబు, కమల్ బాషా, భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, సర్పంచు ఆరవ ఈశ్వరమ్మ, మునివర, ఉప సర్పంచు లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.


పథకాలపై ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

మైలవరం : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలి పారు. మండల పరిధి లోని దొమ్మర నంద్యాలలో గురువారం ఆయన గడపగడపకు మనప్రభుత్వం కార్య క్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమంలో ముందుగా ఎమ్మెల్యే ప్రతి గడపకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వాటిని పరిష్కరించేలా వెంట ఉన్న అధికారులతో మాట్లాడారు. చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చరిత్ర బిల్డర్స్ అధినేత చెన్నకేశవరెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, రాఘవరెడ్డి, ఎంపిడిఒ రామచంద్రారెడ్డి, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

గణితంపై విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక బ్రాహ్మణపల్లె రోడ్డులోని శ్రీ స్వామి వివేకానంద పాఠశాలలో గురువారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ సుహాసిని ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా పిల్లలు తయారు చేసిన వివిధ ఆకృతులను ఉపాధ్యాయులు సందర్శించారు. ముఖ్య అతిథులుగా వసీం, గీత హాజరుకాగా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వేంపల్లె :** గణితంపై ప్రతి విద్యార్థి ప్రత్యేకదృష్టి పెట్టాలని ప్రధానోపాధ్యాయులు దస్తగిరి కోరారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా గురువారం తాళ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావుల్లో రామానుజన్ ఒక్కరన్నారు. ఆయనకు పదేళ్ల వయసులోనే గణితశాస్త్రంతో అనుబంధం ఏర్పడిందని వివరించారు. చిన్న వయసులోనే గణితం పట్ల ప్రకృతి సిద్ధమైన ప్రతిభ కనపరిచేవారని చెప్పారు. ఆయనను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గణితంలో అనతి కాలంలో రాణించిన మేధావి శ్రీనివాస రామానుజన్ అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజీనేయులు పేర్కొన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, గణితశాస్త్ర అధ్యాపకులు కె.రాజారెడ్డి, వైవి సునీత, మాల్యాద్రి, అధ్యాపకులు కిరణ్మయి, షఫీద్దీన్, వీరారెడ్డి, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** విద్యార్థులలో దాగి ఉన్న మేధాశక్తిని వెలికి తీయగల సామర్థ్యం ఉన్న సబ్జెక్టు గణిత శాస్త్రం అని పూజిత ఇంగ్లిష్ మీడియం కరెస్పాండెంట్ ఎస్.రామ్మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.మునీంద్రాదేవి పేర్కొన్నారు. పాఠశాలలో గురువారం శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయుడు వినయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో గురువారం నేషనల్ మ్యాథమెటిక్స్ డేను కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరి నారాయణ, మాథ్స్ డిపార్ట్మెంట్ హెచ్ఒడి శ్రీకాంత్‌రెడ్డి, బయో టెక్నాలజీ డిపార్ట్మెంట్ హెచ్ఒడి రామ్మోహన్, బికాం హెచ్ఒడి గౌరీ శంకర్, కళాశాల గణిత అధ్యాపక బృందం, వైస్ ప్రిన్సిపల్ వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు. **చాపాడు :** గణిత దినోత్సవం సందర్భంగా లక్ష్మీపేట జిల్లా పరిషత్ పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. గణిత క్విజ్ ఏర్పాటు చేసి గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. 100 రకాల పోస్టర్ ప్రజెంటేషన్, 50 రకాల వర్కింగ్ మోడల్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్, సీనియర్ గణిత ఉపాధ్యాయులు నరహరిశర్మను సన్మానించారు. కార్యక్రమంలో గణిత ఉపా ధ్యాయులు తులసి లక్ష్మీ, దరిశా శ్రీనివాసులు, పాఠశాల కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, విజయ, శ్రీని వాసులు, రాముడు, రమణారెడ్డి, ప్రభావతి పాల్గొన్నారు.


పులివెందుల : గణిత శాస్త్ర దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు


వేంపల్లె : రామానుజన్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సగిలేరుకు పంపిన విద్యార్థులను వెనక్కి పిలవాలి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని గురుకుల పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థులను సగిలేరుకు పంపారని, వారిని వెనక్కి తేవాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం డిసిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గండి సునీల్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎద్దు రాహుల్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే వారిని సగిలేరు గురుకుల పాఠశాలకు పంపడం దుర్మార్గమన్నారు. అక్కడ విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. అక్కడ విద్యార్థులకు అసౌకర్యంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్ స్పందిస్తే కానీ ఈ సమస్య పరిష్కారం కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎర్రంపల్లి అజయ్, సహాయ కార్యదర్శి అల్లూరి సందీప్ పాల్గొన్నారు.


డిసిఒకు వినతి పత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉత్సాహంగా క్రిస్మస్ సంబరాలు

ముద్దనూరు : మండల కేంద్రంలోని సెయింట్ జెవియర్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గురువారం ఉత్సాహంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రెవరెండ్ మదర్ సెల్వి రాయప్పన్, కరెస్పాండెంట్ రెవరెండ్ ఫాథర్ మర్రెడ్డి పాల్గొన్నారు. క్రీస్తు జన్మించిన పశువుల పాక ఏర్పాటు చేసి క్రిస్మస్ సందేశం గురించి పిల్లలు, విద్యార్థులు వివరించారు. చిన్నారులు, విద్యార్థులు ఆటపాటలతో, వివిధ సాస్కృతిక కార్యక్రమాలు నృత్యాలతో అలరించారు. దేవదూత, క్రిస్మస్ తాత వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెడ్ మిసెస్‌లు రెవరెండ్ సిస్టర్ నిర్మల, జ్యోతి, సిస్టర్లు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న చిన్నారుల వివిధ వేషధారణలు

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరూ పేదలకు తమ వంతు సాయం అందించి ఆదుకోవాలని మిడుతూరుకు చెందిన రూరల్ హౌసింగ్ ఆయకట్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు సి.యేసుపాదం సూచించారు. మండల పరిధిలోని మిడుతూరు గ్రామంలోని సిఎస్ఐ చర్చి ఆవరణలో క్రిస్మస్ పండగ పురస్కరించుకొని గురువారం పేదలకు దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని, ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎన్జీవో కన్సల్టెంట్ రాజశేఖర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



దుస్తులను అందజేస్తున్న సొసైటీ అధ్యక్షులు యేసు పాదం

ప్రగతి నిరోధకుడు సిఎం జగన్ : తులసిరెడ్డి

వేంపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రగతి నిరోధకుడని మాజీ ఎంపీ తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి పట్టిన శని గ్రహం జగన్ అని విమర్శించారు. కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణ పనులు నిలిచిపోవడమే ప్రగతి నిరోధకానికి జగన్ కారణమన్నారు. నూతన రైలు మార్గం రాయలసీమ సమగ్రాభివృద్ధికి ఎంతో అవసరమని తెలిపారు. ఈ అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులు భరించే షరతుతో 2008-09లో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 268 కిలోమీటర్ల పొడవుతో నాటి అంచనా వ్యయం రూ.3038 కోట్లు అన్నారు. ఇందులో రూ.351 కోట్లు ఖర్చు చేసి కడప నుండి పెండ్లిమర్రి వరకు 21.30 కిలోమీటర్ల పని పూర్తి చేశారన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయని కారణంగా రైల్వేశాఖ నిర్మాణపు పనులు నిలిపేసిందన్నారు. కాంగ్రెసు హయాంలో తండ్రి రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేయించగా, తనయుడు జగన్ పక్కన పెట్టడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర వాటాగా ఇవ్వాల్సిన నిధులు విడుదల చేసి, రైల్వే పనులు పునఃప్రారంభం అయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

'రూట' రాష్ట్ర కన్వీనర్‌గా అఫ్జల్ బాషా

కడప అర్బన్ : రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, ఆంధ్ర ప్రదేశ్ (రూట ఏపి) ప్రెస్ అండ్ పబ్లిసిటీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ గా కడప నగర పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు షేక్. అఫ్జల్ బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మూడు దశబ్దాలుగా ఉర్దూ పాఠశాలల, ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారానికి అఫ్జల్ బాషా ఎంతో కృషి చేశారని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లయన్. ఇమాం బాషా, సయ్యద్ ఇక్బాల్, కార్యనిర్వాహక అధ్యక్షులు ఫైరోజ్ బాషా కొనియాడారు. సందర్భంగా అఫ్జల్ బాషా మాట్లాడుతూ రూట సంఘ బలోపేతానికి, ఉపాధ్యాయ, పాఠశాలల , విద్యార్థుల సమస్యలు వివిధ ప్రచార సాధనాల ద్వారా ప్రభుత్వ దృష్టి కి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

'ఆయుష్మాన్ భారత్'ను సద్వినియోగం చేసుకోవాలి

చాపాడు : ప్రభుత్వం పేద ప్రజలకు వైద్యం అందించేందుకు ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి లబ్ధిదారుల వివరాలు వాలంటీర్లకు జాబితా వచ్చిందన్నారు. జాబితాలో ఉన్న లబ్ధిదారులు తమ వివరాలు ఆధార్‌తో అనుసంధానం చేయించుకోవాలన్నారు. నమోదు చేసుకున్న లబ్ధిదారులకు కార్డులు మంజూరు అవుతాయన్నారు. రూ.5లక్షల వరకు వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. వాలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి ఆధార్ ఒటిపితో వ్యక్తులకు సంబంధించిన ఫొటోలు తీసుకుంటారని తెలిపారు. ఇందుకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని ఎంపిడిఒ కోరారు.

డెంగీ పట్ల అప్రమత్తత అవసరం

ఖాజీపేట : డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. చెమ్ముళ్లపల్లె సచివాలయం చెమ్ముళ్లపల్లె మెయిన్ గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో డాక్టర్ నాగ రాజు, జిల్లా మలేరియా అధికారిణి మనోరమ ఆదేశాల మేరకు ఖాజీపేట వైద్యాధికారి డాక్టర్ ఎస్ ముబీనా ఆధ్వర్యంలో గురువారం వైద్యబృందం గ్రామానికి చేరుకొని, ఇంటింటా లార్వా సర్వే, జ్వరాల సర్వే చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు పలు జాగ్రత్తలు, సూచనలిచ్చారు. సబ్ యూనిట్ అధికారి కె.లక్షుమయ్య మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోధకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. ప్రస్తుతం కరోనా మళ్లీ ఉధృత మవుతున్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య, సూపర్ వైజర్ సునీల్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పి ఉమా, ఎఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, నాగేశ్వరి, రోజమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు తప్పక వేయించాలి

ప్రొద్దుటూరు : చిన్నపిల్లలకు వారి బంగారు భవిష్యత్ కోసం వారికి తప్పనిసరిగా టీకాలు వేయించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యుహెచ్ఒ) మానిటరింగ్ అధికారి డాక్టర్ సురేష్‌రెడ్డి సూచించారు. స్థానిక టిబి రోడ్డు పరిధిలోని 1,3,4,5 సచివాలయాల పరిధిలో ఇంటింటికి వెళ్లి పిల్లల ఆరోగ్యం పరిస్థితిని పరీక్షించారు. 0-3 సంవత్సరలోపు పిల్లలకు టీకాలు అందాయా లేదా అని విచారించారు. యంసిపి కార్డులను పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని తల్లులకు వివరించారు. టీకాల ఆవశ్యకతను వివరించారు. హరిజనవాడ-1 సచివాలయ పరిధిలోని పిల్లల ఆరోగ్య వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్, సిఒ సుబ్బారెడ్డి, ఆరోగ్య కార్యదర్శులు గృహలక్ష్మి, రెబకమ్మ, జ్యోతి, జయమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

పెద్దముడియం : మేడిదిన్నె పిహెచ్‌సి పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో జిల్లా ఉపవైద్యాధికారిని డాక్టర్ శాంతికళ పర్యవేక్షణలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, ఫీవర్ సర్వే, లార్వా సర్వే విజయవంతమైంది. గ్రామంలో పర్యటిస్తూ లార్వా ఉన్న ప్రదేశాలను గుర్తించి తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ శాంతికళ స్థానికులకు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కాన్పుకు ఆసుపత్రికి వెళ్లేం దుకు ప్రత్యేకంగా వాహన సౌకర్యం ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హుస్సేన్, సూపర్వైజర్లు వెంకటరమణ, శాంతకుమారి, రామ్మోహన్ ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.